ప్రజాశక్తి

సోమవారం 6 మే 2024 పేజీలు 8

విజయనగరం పార్వతీపురం మన్యం

బహిరంగ సభలో మాట్లాడుతున్న బృందాకరత్

అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్సతో కలిసి అభివాదం చేస్తున్న బృందాకరత్

బిజెపి ఇంజిన్‌కు టిడిపి, వైసిపి బోగీలు

ఈ మూడు పార్టీలను ఓడిస్తేనే ప్రజలకు రక్షణ

సిపిఎం పాలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పాలకొండ

బిజెపి ఇంజిన్‌కు టిడిసి.వైసిపి బోగీలులా పని చేస్తున్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. ఈ మూడు పార్టీలను ఓడిస్తేనే ప్రజలకు రక్షణ ఉంటుందని అన్నారు. లేదంటే ఎపికి ప్రత్యేక హోదా రాకపోవడంతో పాటు ప్రజా హక్కులు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకు, ఇండియా వేదిక నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం పాలకొండలో బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ముఖ్యవక్త పాల్గొని మాట్లాడారు. తొలుత పాలకొండ చేరుకున్న ఆమెకు సిపిఎం, కాంగ్రెస్ శ్రేణులు డప్పుల వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు.

సభకు హాజరైన జనం

అనంతరం సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తిరుపతి రావు అధ్యక్షతన జరిగిన సభలో బృందాకరత్ మాట్లాడారు. సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ యువకులని, పార్లమెంటులో పేదల తరుపున గట్టిగా పోరాడుతారన్న నమ్మకం తనకుందన్నారు. ప్రస్తుత ఎన్నికలు అసాధారణమైనవని అన్నారు. ఎన్నికల ద్వారా దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం (మిగతా.. 2లో)

ఎన్నికల విధుల్లో ఉన్న

ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్

- రూ.450 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువుల సీజ్
- సున్నిత ప్రాంతాల్లో పటిష్ట నిఘా
- పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్దే ఫారం 12ను స్వీకరించి అర్హులైన ఉద్యోగులందరికీ అక్కడికక్కడే ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు. ఇందుకోసం ఈనెల 7,8 తేదీల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. ఓటింగ్‌కు చేసిన ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్‌లు, క్యూలెన్లు, పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ఓటర్లతో మాట్లాడి వారి సమస్యలను, ఏర్పాట్లపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఏర్పాట్లపట్ల ఉద్యోగులు సిఇఒ వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో పోస్టల్ ఓటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను, ఎన్నికలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను (మిగతా.. 2లో)

ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

పోస్టల్ బ్యాలెట్‌కు పోటెత్తిన ఉద్యోగులు

హెల్ప్ డెస్క్ వద్ద సేవలందిస్తున్న సిబ్బంది

జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఉత్సాహంగా ప్రారంభమైంది. ఓటు వేసేందుకు ఉద్యోగులంతా ఉదయం 8.30గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 18631 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోగా, తొలిరోజు 4989 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరేకాక ఇతర జిల్లాలకు చెందిన 670 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 6,812 ఓట్లకు గాను 3,310 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- తొలిరోజు ప్రశాంతం
- ఉదయం నుంచే బారులు తీరిన ఉద్యోగులు
- ఇబ్బందులు లేకుండా హెల్ప్‌డెస్క్‌లు
- విజయనగరం జిల్లాలో పోలైన ఓట్లు 4,989
- మన్యం జిల్లాలో పోలైన ఓట్లు 3,310

బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి జెఎన్‌టియులో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒకటి రెండు కేంద్రాల్లో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. నియోజక వర్గ ఫెసిలిటేషన్ సెంటర్‌ను, రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పర్యవేక్షించారు. కొంతమంది ఉద్యోగులకు ఓటు లేకపోవడంతో వారంతా ఆందోళన చెందారు. జెసి కార్తీక్ వెంటనే స్పందించి ఓటరు జాబితాలో పేరు లేనప్పటికీ, ఎన్నికల డ్యూటీ ఆర్డరు ఉంటే వెనువెంటనే ఫారం -12 అక్కడికక్కడే నింపించి ఓటు హక్కు కల్పించారు. దీంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకు న్నారు. హెల్ప్ డెస్క్‌ల్లో ఓటర్లకు అందుతున్న సహాయాన్ని, ఓటింగ్ జరుగుతున్న కేంద్రాలను జెసి కార్తీక్ పరిశీలించారు. ఓటింగ్‌కు వచ్చే ఉద్యోగులకు టిఫిన్లు, కూర్చునేందుకు టెంట్లు ఏర్పాటు చేశారు.

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన రెండు ఫెసిలిటేషన్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ ప్రక్రియను (మిగతా..2లో)

ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగి

నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	ఓటర్లు	పోలైనవి
విజయనగరం	3975	1356
శృంగవరపుకోట	1757	563
చీపురుపల్లి	1373	385
నెల్లిమర్ల	1527	587
గజపతినగరం	1824	603
బొబ్బిలి	2096	749
రాజాం	1741	746
పార్వతీపురం	1751	1098
సాలూరు	1291	546
పాలకొండ	1539	756
కురుపాం	2,241	910

రామారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న జయలక్ష్మి

రామారావు ఆశయ సాధనకు పునరంకితమవుదాం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విప్లవ సాంస్కృతికోద్యమ యోధులు, అరుణోదయ ఎపి రాష్ట్ర అధ్యక్షులు, సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణోదయ రామారావు ఐదో వర్ధంతి మండలంలోని కోరీలో జరిగింది. ముందుగా రామారావు చిత్రపటానికి పూలమాల వేసి అరుణోదయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంబుడు జయలక్ష్మి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బొత్స నర్సింహారావు, పిఒడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి తదితరులు వక్తలు మాట్లాడుతూ రామారావు కళలు, సాహిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి సరైన మార్గనిర్దేశం చేస్తూ, వారిని చైతన్యపరచాయని, ప్రజల ఆందోళనలను, పోరాటాలను గానం చేయాలని బలంగా నమ్మి, ఆ రకమైన కృషిలో తన పయనం సాగించారని కొనియాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరుగా ఆ సంస్థ ద్వారా ప్రజల బాధలను, కష్టాలను, కన్నీళ్లను గానం చేసి వారిని కర్తవ్యోన్ముఖులను చేశారని అన్నారు. కళాకారుడుగానే కాక విప్లవ పార్టీ నాయకుడుగా దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకై సాగే కృషిలో భాగస్వామ్యమయ్యాడని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నో ప్రజా ఉద్యమాలు, ప్రజాందోళనలో స్వయంగా పాల్గొంటూ వాటికి తన గళం ద్వారా ప్రజల్లో మద్దతు కూడగట్టాడని చెప్పారు. రామారావు లేని లోటు పూడ్చలేనిదని, ఆయన ఆశయ సాధనలో భాగంగా విప్లవ సాంస్కృతికోద్యమ నిర్మాణానికై పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.



పర్యాటకులను ఆకర్షిస్తున్న 5-డి థియేటర్

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకులు సందడి చేశారు. వేసవి తాపం అధికంగా ఉండడంతో పర్యాటకులు కాస్త సేద తీర్చుకోవడానికి ఉదయం, సాయంత్రం సమయాల్లో పర్యాటకులు తరలివస్తున్నారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో విహరించారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. పిల్లలు బోటింగ్ చేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు. జగత్ పల్లి రిసార్ట్స్ సందర్శించారు. ఆడాలి ఈ పాయింట్‌ను తిలకించారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పనస నందివాడ, ఎంవిపురం, కుమ్మరి గుంట గ్రామాల్లో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన రాష్ట్ర పరిశీలకులు కోకన రవికుమార్ ఆధ్వర్యంలో పనస నందివాడకు చెందిన సర్పంచ్ ప్రతినిధి బి శామ్యూలు, మాజీ సర్పంచి కె.సన్యాసినాయుడు, బి.జీవరత్నం, సుందర్రావు, ప్రసాదు, కె.లక్ష్మణ్, బి.ఫణికుమార్, ఆర్ ఆదినారాయణ, కూర్మినాయుడు, కె. రామకృష్ణ, జి.పోలినాయుడు తదితరులకు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, కె.ఆసిరినాయుడు మాచర్ల అనిల్ కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు

బిజెపి ఇంజిన్‌కు టిడిపి, వైసిపి బోగీలు

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. స్వాతంత్రం వచ్చాక ఇప్పటి వరకు ప్రజాస్వామ్యాన్ని ఇంతలా ఖూనీచేసిన ప్రభుత్వం బిజెపియేనన్నారు తీవ్రమైన దాడులు జరడం ఇదే మొదటి సారన్నారు. దేశంలో గిరిజన హక్కుల రక్షణ, 5వ, 6వ షెడ్యుల్ ఏరియా అనే రెండు చట్టాలు రాజ్యాంగం కల్పించిం దన్నారు. 2004లో కమ్యూనిస్టుల సహకారం తో అధికారంలోకి వచ్చిన యుపిఎ -1 ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం తీసుకొచ్చిందన్నారు. వీటికి మోడీ ప్రభుత్వం గడిచిన పదేళ్ళలో తూట్లు పొడుస్తూ గిరిజ ప్రాంతంలోని సంపద కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నించారని తెలిపారు. అటవీ సంరక్షణ చట్ట సవరణ పేరుతో గిరిజన హక్కులను బిజెపి కాలరాస్తోందన్నారు. గ్రామ సభలు జరిపి ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా బొగ్గు, అటవీ సంపద తదితరాలను అదానీ, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. ఇటువంటి పరిస్థితి మునుపెన్నడూ చూడలేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గిరిజనుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోందన్నారు. జీవో నెంబర్ 3 రద్దుతో గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం రిజర్వేషన్ రద్దు చేసినప్పటికీ మోడీ స్పందించలేదన్నారు. దీంతో, గిరిజనులు ఉద్యోగ, ఉపాధికి దూరం కావడం తోపాటు, విద్యలో వెనుక బాటు మొదలైందన్నారు. ముఖ్యంగా గిరినేతర భాష వల్ల పాఠశాల విద్యార్థులు పాఠ్యాంశాలను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారనీ వివరించారు. అటవీ ప్రాంతంలోని గిరిజనేతర నిరుపేద విద్యార్థులు కూడా నష్ట పోతున్నారన్నారు. అయినా మోడీ దీన్ని లెక్క చేయడం లేదన్నారు. మోడీ విధానాల వల్ల గత పదేళ్లలో 4లక్షల మంది ఆత్మహత్యలు, 25వేల మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారని అన్నారు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వానికి మానవత్వం లేదన్నాను. రైతులు, కార్మికులు, ఉద్యోగుల కు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొచ్చి ఎన్నికల వేళ ఆయా తరగతులలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారం లోకి రాకముందు దేశంలో ఒక్క శాతంగా ఉన్న ధనవంతులు ఇప్పుడు 40శాతంగా ఉన్నారని తెలిపారు. మరోవైపు రైతులు, కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ లో చట్టాలు చేసి, ఇవి జనానికి తెలియకుండా చేసేందుకు మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఇది ఆదివాసీలు, మైనార్టీ భావాలు దెబ్బ తీస్తోందన్నారు. మణిపూర్ లో ఆదివాసీల మధ్య మతం పేరుతో ఘర్షణలు సృష్టించడం ఇందుకు నిదర్శనమన్నారు. అందుకే మతతత్వ బిజెపిని ఓడించాలని సిపిఎం కోరుతోందన్నారు.

ఎపిలో విచిత్రమైన పరిస్థితి ఉందని, బిజెపి ఇంజన్‌కు టిడిపి, వైసిపి బోగీల్లా పనిచేస్తున్నాయని బృందాకరత్ విమర్శించారు. వైసిపి ఎంపిలు రాష్ట్రం కోసం ఒక్క మాట కూడా మాట్లాడడం లేదన్నారు. గిరిజనులు, కార్మికులకు వ్యతిరేక చట్టాలపైన, ఎపికి ఏంతో అవసరమైన ప్రత్యేక హోదా పైనా మాట్లాడకుండా నోటికి బంక అంటించుకున్నారని అన్నారు. చాలామందిని భయపెట్టి రూ.8,500 కోట్లు ఎన్నికల బాండ్లను బిజెపి తీసుకుందనీ

అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు, కాంగ్రెస్ పాలకొండ అభ్యర్థి

సభలో మాట్లాడుతున్న పుణ్యవతి

విమర్శించారు. బిజెపి వాషింగ్ మిషన్ పంటిదని, సిబిఐ, ఇడి, ఐటి వంటి స్వయం ప్రతిపత్తి గల సంస్థలను వాషింగ్ పౌడర్‌లా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. తద్వారా టిడిపి,వైసిపిలను బిజెపి బెదిరి స్తుందని తెలిపారు. బిజెపి టైర్ పంచర్ అయిపోయిందని, దీంతో ఆపార్టీ వాహనా లకు టిడిపి బ్యాక్ టైర్ లాగా, వైసిపి స్టెపినీ లాగా పని చేస్తున్నాయ న్నారు. దీన్ని ప్రజలు ఇక అంగీకరించ బోరని అన్నారు వైసిపి, టిడిపి ఎంపిలు ఎంపిప్రత్యేక హోదా కోసం పోట్లాడడం లేదని, అందుకే ఇండియా వేదికలో చేరలేదని తెలిపారు. ప్రజాస్వా మ్యం కాపాడ డానికే అనేక పార్టీలు ఇండియా వేదిక లోకి వచ్చాయనాక్నరు బిజెపిని, దాని పొత్తులు, తొత్తులను ఓడించి, సిపిఎం, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం గత పదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదని, కరోనా సమయంలోనూ ప్రజలను ఆడుకోవడంలో విఫలమ య్యారని అన్నారు. బిజెపి, దాని మిత్ర పక్షాలను ఓడించి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అరకు ఎంపిఅభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ బిజెపి మరోసారి అధికారం లోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతులు, గిరిజనులు, మహిళలు, కార్మికులు, మైనార్టీల హక్కులను కాల రాసిందని అన్నారు. వైసిపి, టిడిపి ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థులు గిరిజనులు కాదని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పోటీ చేస్తున్నా రని అన్నారు, వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పాలకొండ ఎంఎల్ఎ అభ్యర్థి సవర చంటిబాబు మాట్లాడుతూ ఇండియా వేదికను గెలిపించడం ద్వారానే బిజెపి నుంచి ప్రజలకు రక్షణ అని అన్నారు. తనను గెలిపిస్తే గిరిజనుల గొంతు నై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు, కె.సుబ్బురావమ్మ, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, మన్యం, శ్రీకాకుళం జిల్లాల కార్యదర్శులు రెడ్డి వేణు, గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు, మన్యం జిల్లా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు తదితరులు మాట్లాడారు.

పోస్టల్ బ్యాలెట్‌కు పోటెత్తిన ఉద్యోగులు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై ఉద్యోగులను ఆరా తీశారు. పలు సూచనలు చేశారు. క్యూలైన్లలో ఎక్కువ సేపు వేచి ఉండకుండా, ప్రక్రియను వేగంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన వారికి హెల్ప్ డెస్కుల్లో పూర్తి సమాచారాన్ని అందించాలని చెప్పారు. కొంతమంది తమ ఓటు జాబితాలో లేదని చెప్పడంతో, వారికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తామని కలెక్టర్ చెప్పారు. డ్యూటీ నియామక పత్రాలు, గుర్తింపు కార్డులను తీసుకువెళ్లి సంబంధిత నియోజకవర్గంలో ఓటు వేయవచ్చునని సూచించారు.

ఇతర జిల్లాలకు చెంది ఉండి ఈ జిల్లాలో ఉద్యోగం చేస్తున్న వారు ఓటు వేసేందుకు వీలుగా జెఎన్‌టియు బ్లాక్ 1లో ఏర్పాట్లు చేశారు. ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఉద్యోగులు ఎక్కడా ఇబ్బంది పడకుండా హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసి, ఓటర్ స్లిప్పులు, అవసరమైన ఇతర సహాయ సహకారాలను అందించారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌తోపాటు పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి కె.సందీప్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, జెడ్‌పి డిప్యుటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, ఇతర అధికారులు ఓటింగ్ ప్రక్రియను, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఓటింగ్ జరుగుతున్న ప్రాంతానికి వైసిపి ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ వచ్చి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల బయట ఉద్యోగులను కలిసి ఓటుకోసం అభ్యర్థించారు.

విజయనగరం అసెంబ్లీ పరిధిలో మొత్తం 3,975 మంది ఓటర్లకు గాను 1356 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. శృంగవరపుకోట : నియోజకవర్గ కేంద్రంలోజరిగిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో 1757ఓట్లకు గాను 563 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ పరిశీలించారు. ఈనెల 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

గజపతినగరం : నియోజకవర్గ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 1824ఓట్లకు గాను 603ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి సూర్యకళ పరిశీలించారు. పోలింగ్ ఆఫీసర్లు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బొబ్బిలి : గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో ఉదయం 9 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. నియోజకవర్గంలో 2096మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా 749మంది మొదటిరోజు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ పర్యవేక్షించారు.

గుమిగూడిన రాజకీయ పార్టీల నాయకులు

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు గుమిగూడారు. పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన సందర్శించారు. ఈ కేంద్రానికి సమీపంలో రాజకీయ పార్టీల నేతలు ఉండడంతో వారిని దూరంగా పంపించాలని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావును ఆర్ఒ సాయిశ్రీ ఆదేశించారు. దీంతో రాజకీయ నాయకులను దూరంగా పంపించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో సిఐ నాగేశ్వరరావు, వైసిపి నాయకుల మధ్య వాగ్వివాదం జరిగింది.

నెల్లిమర్లలో 587 ఓట్లు

నెల్లిమర్ల : నియోజక వర్గంలో 1527 మందిఓటర్లకు గాను 587 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నారు. స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఐదు పోలింగ్ కేంద్రాలలో నిర్వహించిన పోలింగ్ లో 587 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు. వీరిలో 128 మంది మహిళలు, 453 పురుషులు ఉన్నారు. రిటర్నింగ్ అధికారి ఎం.నూక రాజు, ఎఆర్ఒ డి. ధర్మ రాజు పోలింగ్‌ను పరిశీలించారు.

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా సిఇఒ మీనా మీడియాతో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. పోస్టల్ ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు, ఓటు కోసం దరఖాస్తు చేసుకోని వారు సైతం తమ ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు కార్డును సంబంధిత ఫెసిలిటేషన్ సెంటర్‌కు తీసుకువెళ్లి, ఓటు పొందవచ్చునని సూచించారు. ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే రెండు విడతల శిక్షణ పూర్తయ్యిందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు, ప్రలోభాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.450కోట్లు విలువైన నగదు, మద్యం, విలువైన పరికరాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ప్రతీ మండలంలో మండల అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేసి, మద్యాన్ని ఎక్కడికి రవాణా చేస్తున్నదీ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 12,400 సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్, కేంద్ర బలగాలను వినియోగించడం, మైక్రో అబ్జర్వర్ల నియామకం, వీడియో గ్రఫీ తదితర చర్యలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇవే కాకుండా రాజకీయంగా సున్నితంగా ఉన్న 14 నియోజకవర్గాల్లో అదనపు భద్రతా చర్యలు చేపట్టామని, వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఓటింగ్ రోజు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పర్యటనలో జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ కె.సందీప్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, జెడ్‌పి డిప్యుటీ సిఇఒ కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతమే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో రాక్షస పాలన అంతమే ఉమ్మడి కూటమి ధ్యేయమని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, విజయనగరం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. మండలంలోని చిల్లపేట, సారిక, జొన్నవలస గ్రామాలలో ఆదివారం ఎన్నికల ప్రచార బహిరంగ సభల్లో వారు పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ ఎన్నికలలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. పిల్లలకు మంచి ఉద్యోగాలు వస్తాయని, మహిళలకు రక్షణ ఉంటుందని, పోలవరం, రాజధాని పూర్తి అవుతాయని అన్నారు. మే 13న జరగబోవు ఎన్నికలలో కూటమికి మద్దతు తెలిపి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, కలిశెట్టి అప్పలనాయుడుని ఎమ్పీగా గెలిపించాలని అదితి గజపతిరాజు కోరారు. ఈ

బొండపల్లి : గొల్లుపాలెంలో ప్రచారం చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు అప్పలనాయుడు, శ్రీనివాస్

విజయనగరం : ప్రచారంలో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

కార్యక్రమంలో టిడిని, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలన నుంచి విముక్తి చేయాలి

బొండపల్లి : రాష్ట్రంలో అరాచక పాలన నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు టిడిపి కూటమిని గెలిపించాలని టిడిపి ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. బి.రాజేరు, గొల్లుపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అన్ని రంగాలను అభివృద్ధి వైపు నడిపిస్తారని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా బడుగు బలహీన వర్గాలకు ఆర్థికంగా సహాయం చేసేందుకు దోహద పడతాయని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ కృష్ణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు బాలాజీ, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనువాస రావు, కెరటాం సర్పంచ్ నబూరి రాజేష్, గేదెల మహేష్,తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను పరిశీలించిన కలిశెట్టి

విజయనగరం కోట : రాజాం నియోజకవర్గ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌కేంద్రాన్ని విజయనగరం పార్లమెంట్ స్థానం టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారం పరిశీలించారు. పోలింగ్‌జరుగుతున్న రాజాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి పరిశీలించారు.

ఎన్నికల ఖర్చుపై నిఘా ఏదీ?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై పర్యవేక్షణ కొరవడినట్లు తెలుస్తోంది. నామినేషన్ల సందర్భంలోనే అభ్యర్థులు రూ. లక్షలో ఖర్చు చేశారు. ఎన్నికల కమిషన్ ఎంఎల్ఎ అభ్యర్థికి రూ.40 లక్షలు, ఎంపి అభ్యర్థికి రూ.95 లక్షలు వ్యయ పరిమితి విధించిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో పరిమితికి మించి ఖర్చు పెట్టే అవకాశం ఉన్నందున అభ్యర్థులపై నిరంతరం నిఘా ఉంచాల్సి ఉంది.అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలకు మించి ఖర్చు చేస్తే అనర్హులు అవుతారని ఎన్నికల పరిశీలకుల హెచ్చరికలు, అధికారుల ఆదేశాలు ప్రకటనలకే పరిమితమవుతున్నారు. అభ్యరులెవరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాల్లో 11అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు చేస్తున్న ఎన్నికల ఖర్చు చూస్తే అంతా నోరెళ్లబెడుతున్నారు. ఎన్నికల సంఘం విధించిన ఖర్చు పరిమితి నామినేషన్ సందర్భంగానే ఖర్చయిపోయినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం విధించిన పరిమితికి మించి ఖర్చు అభ్యర్థులు ఒక్క నామినేషన్ రోజునే ఖర్చు చేసేసినట్లు తెలుస్తోంది. ఆ తరువాత నుంచి రోజూ ప్రచారంలో విచ్చలవిడిగా మద్యం, డబ్బు పంచిపెడుతున్నారు. ప్రచారానికి వస్తున్న వారికి ఒక్కొక్కరికీ రూ.300 నుంచి రూ.500 వరకు వైసిపి, టిడిపి, జనసేన అభ్యర్థులు ఇస్తున్నారు. ర్యాలీల్లో పాల్గొంటున్న వాహనదారులకు పెట్రోల్‌సైతం పోయిస్తున్నారు. వీటన్నింటిపైనా ఎక్కడా అధికారుల నిఘా ఉన్నట్లు కనిపించడం లేదు. ప్రచారాల్లో రోజు వందల మంది పాల్గొంటున్నారు. వీరందరికీ భోజనాలు, మందు, డబ్బులు లెక్కలు వేస్తే ఎప్పుడు ఎన్నికల సంఘం విధించిన ఖర్చు పరిమితి మించిపోయినట్లు తెలుస్తోంది.

సంజీవని ఆరోగ్య కేంద్రమేదీ?

ప్రజాశక్తి - సాలూరు

ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో సంజీవని ఆరోగ్య కేంద్రాన్ని మాజీ సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కొద్ది నెలల క్రితం ప్రారంభించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు కొద్ది రోజుల ముందు ఆడంబరంగా ఈ కేంద్రాన్ని గొల్లివీధి సందులో ఏర్పాటు చేశారు.

పేదలకు ఉచిత వైద్యమని టిడిపి గొప్పలు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కేంద్రంలో ఒక వైద్యుడు వుంటారని, పట్టణ, గ్రామీణ ప్రజలెవరైనా తనిఖీలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చునని చెప్పారు. ఎన్నికల ముందు ప్రారంభించారంటే కనీసం ఓట్లు కోసమైనా ఈ కేంద్రాన్ని రెండు, మూడు నెలలు నడుపుతారని ప్రజలు భావించారు. కానీ ప్రారంభించిన తర్వాత ఒక్క రోజు కూడా ఈ కేంద్రాన్ని తెరిచిన దాఖలాల్లేవు. పేదలకు ఉచిత వైద్యం, మందులు అందజేసింది లేదు. ప్రచార ఆర్భాటం కోసమే టిడిపి నాయకులు సంజీవని ఆరోగ్య కేంద్రం ప్రారంభించారని జనం గుసగుసలాడుకుంటున్నారు.

Format C-1
Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No 536 of2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate: **KALLA SURI BABU.**

Name of political party: **JATIYA JANA SENA PARTY.**

(Independent candidates should write "Independent" here)

Name of Election: **Andra Pradesh General Election.**

*Name of Constituency: **No.18, Vizianagaram Assembly Constituency.**

I KALLA SURI BABU (Name of Candidate), a Candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal cases

S.I. No.	Name of Court	Case no, and dated.	Status of Case(s)	Section(s) of Acts Concerned and brief description of offence(s)
1.	First Addl. Judicial Civil Judge(Junior Division) class Magistrate Vizianagaram	P.R.C. No 2312/ 2022	For Trail	Alleged that the accused is liable for punishment for attempting murder as along with unlawful assembly with dangerous weapon Secs 147,148,149, 307,324 of IPC

(**B**) Details about cases of convection for criminal offences: **No.**

S.I. No.	Name of Court and date (s) of order(s)	Description of offence(s) & punishment imposed	**Maximum punishment imposed**
	Not Applicable.	Not Applicable.	Not Applicable.

Format C-1
Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No 536 of2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate: **Kolagatla Veerabhadra Swamy.**

Name of political party: **YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY.**

(Independent candidates should write "Independent" here)

Name of Election: **Andra Pradesh General Election.**

*Name of Constituency: **No.18, Vizianagaram Assembly Constituency.**

I Kolagatla Veerabhadra Swamy (Name of Candidate), a Candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal cases

S.I. No.	Name of Court	Case no, and dated.	Status of Case(s)	Section(s) of Acts Concerned and brief description of offence(s)
1.	Hon'ble Court of Special Mobile Magistrate at Vizianagaram	CC 704/ 2022 And 10.03.2022	For Trail	Sec. 143,145,341, 188 R/W 149 of IPC. Sec. 3 (X) A.P. TOWN NUISANCE ACT-1989 It is alleged that the accused caused to breach the public peace by wrongfully restraining people from their way with common object and caused nuisance in the town and thus the accused are liable to be punished under the above sections.
2.	Hon'ble Judge Special Court for the Trial of Cases relating to Elected M.Ps and M.L.As; VIJAYAWADA	C.C. NO. 29/2018	For Trail	Secs 143,145,341 R/W 149 IPC. Sec 3 (X) A.P. TOWN NUISANCE ACT 1989. It is alleged that the accused caused to breach the public peace by wrongfully restraining people from their way with common object and caused nuisance in the town and thus the accused are liableto be punished under the above section.

(**B**) Details about cases of convection for criminal offences: **No.**

S.I. No.	Name of Court and date (s) of order(s)	Description of offence(s) & punishment imposed	**Maximum punishment imposed**
	Not Applicable	Not Applicable.	Not Applicable.

గజపతినగరం పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ప్రక్రియపై ఆరాతీస్తున్న ఎన్నికల పరిశీలకులు

చీపురుపల్లిలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఉద్యోగి

పాలకొండలో పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్

విజయనగరంలో పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. తొలిరోజు భారీ సంఖ్యలో ఉద్యోగులు ఓటేసేందుకు తరలివచ్చారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు కిటకిటలాడాయి. కొన్ని కేంద్రాలను అభ్యర్థులు సందర్శించారు.

బొబ్బిలిలో ఉద్యోగి చేతి వేలిపై సిరాచుక్క వేస్తున్న ఎన్నికల సిబ్బంది

గజపతినగరంలో పోస్టల్ బ్యాలెట్‌ను భద్రపరుస్తున్న సిబ్బంది

కురుపాంలో ఎన్నికల విధుల్లో నిమగ్నమైన సిబ్బంది

నెల్లిమర్ల, పార్వతీపురంలో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ఉద్యోగులు

సార్వత్రిక సంగ్రామం

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
సోమవారం
6 మే 2024

బొబ్బిలి రాజా ఎవరు?

- బరిలో 8 మంది
- ప్రచారంలో ముందున్న ప్రధాన పార్టీలు
- వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీ

సార్వత్రిక ఎన్నికల్లో బొబ్బిలి నియోజకవర్గంలో నువ్వా నేనా? అన్నట్లు పోటీ నెలకొంది. నియోజకవర్గం నుంచి 8మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ప్రచారంలో మాత్రం వైసిపి, టిడిపి, కాంగ్రెస్ ముందంజలో ఉన్నాయి. ప్రచారంలో మూడు పార్టీలు ముందున్నప్పటికి వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా ఉంది. ఆ రెండు పార్టీలకు గట్టి పోటీ ఇచ్చే విధంగా కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోంది. నియోజకవర్గంలో వైసిపి, టిడిపిలకు మంది మార్బలం ఉన్నప్పటికీ వారికి దీటుగానే కాంగ్రెస్ ప్రచారంలో ముందుకు వెళ్తోంది. వాటితోపాటు బిఎస్‌పి, ఎస్‌పి, జైభీమ్ రావ్ భారత్ పార్టీతో పాటు ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన మూడు పార్టీలు మాత్రమే ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పటికీ మిగిలిన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ఎక్కడా ప్రచారం చేసినట్లు కనిపించడం లేదు. వైసిపి, టిడిపి ఎత్తుకు పైఎత్తులు వేసి గెలుపు కోసం పావులు కదుపుతున్నాయి. కాంగ్రెస్ మాత్రం నియోజకవర్గంలో బలోపేతం అయ్యేందుకు ప్రయత్నిస్తోంది.

ప్రజాశక్తి-బొబ్బిలి

శంబంగి చినప్పలనాయుడు వైసిపి

బేబినాయన టిడిపి

మరిపి విద్యాసాగర్ కాంగ్రెస్



బొబ్బిలి నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా శంబంగి వెంకట చినప్పలనాయుడు, టిడిపి అభ్యర్థిగా బేబినాయన, ఇండియా కూటమి మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థిగా మరిపి విద్యాసాగర్ పోటీ చేస్తున్నారు. శంబంగి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉంది. 1999లో పెద్దింటి జగన్మోహనరావు, 2004, 2009, 2014 ఎన్నికల్లో సోదరుడు సుజయకృష్ణ రంగారావు విజయంలో బేబినాయన కీలకపాత్ర పోషించారు. ఒకసారి మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన అనుభవమూ ఉంది.

సంక్షేమం, అభివృద్ధిపై నమ్మకం

ఎమ్మెల్యే శంబంగి.. వైసిపి హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి ఎన్నికల్లో విజయతీరానికి చేరుస్తాయని భావిస్తున్నారు. తన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే శంబంగితోపాటు ఆయన కుమారుడు శ్రీకాంత్, సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడు ప్రచారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం

టిడిపి అభ్యర్థి బేబినాయన.. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. తన సోదరుడు సుజయకృష్ణ రంగారావు చేసిన అభివృద్ధి పనులను, తాను చేసిన సామాజిక కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనతోపాటు మాజీమంత్రి, ఆయన సోదరుడు సుజయకృష్ణ, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు కీలకంగా వ్యవహరిస్తున్నారు. జనసేన, బిజెపి నాయకులు కూడా వెన్నంటి ఉంటూ బేబినాయన విజయం కోసం ప్రచారం చేస్తున్నారు.

దీటుగా ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థి విద్యాసాగర్‌కు రాజకీయ అనుభవం పెద్దగా లేదు. అయినా ప్రచారంలో ఎక్కడా వెనుకంజ వేయడం లేదు. కాంగ్రెస్ హయాంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్తున్నారు. వైసిపి, టిడిపి వైఫల్యాలను ప్రజలకు చెప్పి ఇండియా కూటమి అభ్యర్థి విద్యాసాగర్ ఓట్లను అడుగుతున్నారు. విద్యాసాగర్‌కు వామపక్షాల నాయకులు, మేధావులు మద్దతునిస్తున్నారు. త్రిముఖ పోటీలో వైసిపి, టిడిపి అభ్యర్థుల మధ్య గట్టిపోటీ నెలకొనగా ఆ రెండు పార్టీలకు పోటీ ఇచ్చేందుకు ఇండియా కూటమి పని చేస్తోంది. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎవరికి ఓట్లు వేసి బొబ్బిలి రాజాను చేస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కోట కైవసానికి యుద్ధం

ఇక్కడ గెలిచిన పార్టీదే ప్రభుత్వం • 1989, 2009 మినహా అదే రిపీట్

శృంగవరపుకోట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఏ పార్టీ వ్యక్తులు గెలుస్తున్నారో.. అదే పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. టిడిపి ఆవిర్భావం తరువాత జరిగిన తొమ్మిది ఎన్నికల్లో ఏడు పర్యాయాలు అదే ఆనవాయితీ కొనసాగింది. 1989, 2009 ఎన్నికలు మినహా మిగతా అన్నిసార్లు అదే జరిగింది. ఈ నేపథ్యంలోనే శృంగవరపుకోటలో పాగా వేసేందుకు వైసిపి, టిడిపి పోటీ పడుతున్నాయి.



ఎస్.కోటలో గెలవాలని టిడిపి, వైసిపి భావిస్తున్నాయి.

ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోట కోట నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఇక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పును అందిస్తున్నారు. తొలి ముఖ్యమంత్రిని అందించింది కూడా ఇక్కడి నుంచే. గత తొమ్మిది ఎన్నికలు పరిశీలిస్తే.. 1983, 85లో ఎస్.కోట నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా ఎల్‌బి దుక్కు గెలుపొందగా, అదే పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1989లో ఎల్‌బి దుక్కు విజయం సాధించినా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 1994 ఎన్నికల్లో నాలుగోసారి దుక్కు గెలవగా, టిడిపి అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 1999 ఎన్నికల్లో శోభా హైమావతి ఎస్.కోట నుంచి గెలవగా, టిడిపి మరోమారు అధికార పీఠం ఎక్కింది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రమంతా పాదయాత్ర చేసి, కాంగ్రెస్‌ను గెలిపించారు. అప్పుడు కోటలో కాంగ్రెస్ అభ్యర్థి కుంభా రవిబాబు గెలుపొందారు. ఆ తరువాత 2009 ఎన్నికల్లో చిరంజీవి ఎన్నికల అరంగేట్రంతో రాష్ట్రంలో త్రిముఖ పోటీ నెలకొన్న తరుణంలో ఓట్లు చీలి మళ్లీ టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారి విజయం సాధించారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందిన. 2014 ఎన్నికల్లో టిడిపి నుంచి రెండో సారి కోళ్ల లలితకుమారి గెలిచి, ఆపార్టీని అధికారంలోకి తీసుకొని వచ్చారు. గత ఎన్నికల్లో వైసిపి నుంచి కడుబండి శ్రీనివాసరావు గెలవగా, వైసిపి ప్రభుత్వం ఏర్పడింది. ఇలా 1989, 2009 మినహా దాదాపుగా శృంగవరపుకోటలో ఏ పార్టీ గెలుస్తుందో అదే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే

ఎస్.కోట నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు

ఎన్నిక	గెలిచింది	ప్రభుత్వం
1983	ఎల్.బి.దుక్కు(టిడిపి)	టిడిపి
1985	ఎల్.బి.దుక్కు(టిడిపి)	టిడిపి
1989	ఎల్.బి.దుక్కు(టిడిపి)	కాంగ్రెస్
1994	ఎల్.బి.దుక్కు(టిడిపి)	టిడిపి
1999	శోభా హైమావతి(టిడిపి)	టిడిపి
2004	కుంభా రవిబాబు(కాంగ్రెస్)	కాంగ్రెస్
2009	కోళ్ల లలితకుమారి(టిడిపి)	కాంగ్రెస్
2014	కోళ్ల లలితకుమారి(టిడిపి)	టిడిపి
2019	కడుబండి శ్రీనివాసరావు(వైసిపి)	వైసిపి

ఉక్కపోత.. ప్రచార మోత

ఎండదెబ్బకు ఉక్కిరిబిక్కిరవుతున్న అభ్యర్థులు, జంకుతున్న కార్యకర్తలు

ప్రజాశక్తి - కురుపాం

భగభగ మండుతున్న భానుడు ప్రతాపానికి చిన్నా, పెద్దా, వృద్ధులు ప్రతి ఒక్కరూ అవస్థపడుతున్నారు. అవసరమున్న ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఎండవేడికి తట్టుకోలేక మనుషులతో పాటు పశు పక్ష్యాదులు అల్లాడుతున్నాయి. ఎండదెబ్బ బారిన పడేలా చేస్తోంది. ఎన్నికల ముంగిట ఎండ తీవ్రత సాధారణ ప్రజానీకంతో పాటు రాజకీయ పార్టీలకూ తలనొప్పిగా మారుతోంది. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు ఎండవేడిమి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పని పరిస్థితుల్లో అభ్యర్థులు కాస్త ధైర్యం చేస్తున్నా వారి వెంట వెళ్లేందుకు కార్యకర్తలు జంకుతున్నారు. మన్యంలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం ఏకంగా 42 నుంచి 45 డిగ్రీలపైనే నమోదు కావస్తుండడం అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తోంది. మరో 7 రోజుల్లో పోలింగ్ జరగనుండగా అధిక ఉష్ణోగ్రతలు ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు విజయమే లక్ష్యంగా పోరాడుతున్న రాజకీయ పార్టీలను సైతం ఇబ్బందికర పరిస్థితి తలెత్తుతోంది.

ఓ వైపు ఎండవేడి, మరోవైపు ఎన్నికల వేడితో రాజకీయ పార్టీల నాయకులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటి ప్రచారం చేయడం పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఆయా పార్టీల నాయకులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈనెల 13న పోలింగ్ జరగనుండడం ప్రచారానికి కొద్దిరోజులు మాత్రమే సమయం ఉండడంతో ఇంత తక్కువ వ్యవధిలో పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహించగలమా అనే సందేహం వారిలో వ్యక్తమవుతోంది. గత నెలలో కేవలం మండల కేంద్రాలకే పరిమితమైన ప్రచారం కొన్ని రోజుల నుంచి గ్రామాలు, వార్డులకు చేరడం. అధిక ఉష్ణోగ్రతలు తట్టుకొని ప్రచారం నిర్వహించడం అభ్యర్థులకు సవాలుగా మారుతోంది.

భయపడుతున్న కార్యకర్తలు

ఎండవేడిమి, ఉక్కపోత తీవ్రస్థాయిలో ఉన్నా అభ్యర్థులు తప్పనిసరిగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే వారివెంట వచ్చే శ్రేణులు మాత్రం మధ్యలోనే ఆగిపోతున్నారు. కొందరు కార్యకర్తలైతే ఇళ్లు వదిలి బయటకు రావడం లేదు. ఎన్నికలు ఏమో గాని ప్రచారం ప్రాణాల మీదకు వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఉదయం 7 గంటలకే ఎండ తీవ్రత పెరగడంతో అభ్యర్థులు, వారి తరపున ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు ఉదయాన్నే ఆయా గ్రామాల్లో , పట్టణాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి ప్రచారంలో నిమగ్నమవుతున్నారు.

దొందూ దొందే!

- కలహాలతో కొట్టుమిట్టాడుతున్న కళావతి
- ప్రజల నమ్మకాన్ని కూడగొట్టుకోని జయకృష్ణ
- ఇద్దరి వల్ల పాలకొండకు ఒరిగిందేమీ లేదు

ప్రజాశక్తి- పాలకొండ

కళావతి(వైసిపి)

జయకృష్ణ(టిడిపి)

2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తరపున గెలిచిన విశ్వాసరాయి కళావతి వల్ల పాలకొండకు ఒనగురిందేమి లేదని చెప్పవచ్చు. ఒకసారి విపక్ష ఎమ్మెల్యేగా, మరోదఫా అధికారపక్షం లో ఎమ్మెల్యేగా వ్యవహరించిన కళావతి వల్ల పాలకొండ ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదు. సిఎం జగన్మోహన్ రెడ్డికి అత్యంత ఆప్తురాలుగా చెప్పుకుంటున్న కళావతి వల్ల ఈ పది సంవత్సరాల కాలంలో ఒక్క చిన్న పరిశ్రమ అయినా వచ్చిందా అంటే ఏమీ చెప్పుకోలేని పరిస్థితి. కనీసం నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో కూడా ఈమె వెనకబడి ఉన్నారనే చెప్పుకోవచ్చు. కొన్ని దశాబ్దాలు కలగా ఉన్న జంపరకోట జలాశయం, తోటపల్లి ఎడమ కాలువ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. ఈ దశాబ్ద కాలంగా పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ, రైతుబజారు ఏర్పాటు, శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు, వెంకటరాయుని కోనేరు పార్కుగా తీర్చిదిద్దటం, ఇంటింటికి కుళాయి నీరు, సుపర్ స్పెషలిటీ హాస్పిటల్, విద్యార్థుల కోసం పీజీ సెంటర్ ఏర్పాటు పనులు కనీసం ముందుకు కదల్లేదు. ఇవన్నీ ప్రతీ ఎన్నికల్లో హామీలుగా ప్రస్తావించటానికి తప్ప కార్యరూపం దాల్చే ప్రక్రియ మాత్రం జరగడం లేదు. పైపెచ్చు ఈమె తన నోటి దురుసుతో ప్రజల్లో చెడ్డ పేరు మూట కట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్సీ విక్రాంత్‌తో ఈమెకు పొసగదని, వీరిద్దరూ బయటకు ఒకరిపై ఒకరు చూపించే ఆప్యాయత, పలకరింపులు అన్నీ ఉట్టివే అని ప్రజల్లో చర్చ నడుస్తుంది.

2014లో టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగిన నిమ్మక జయకృష్ణ ఓటమి చెందినప్పటికీ 2014 నుండి 2019 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వంలో పాలకొండ నియోజకవర్గ భాద్యుడుగా వ్యవహరించారు. కానీ ప్రభుత్వం నుండి పాలకొండ అభివృద్ధి కోసం ఏమైనా చేశారా అంటే లేదనే చెప్పాలి. టిడిపి హయాంలో కేవలం నియోజకవర్గ భాద్యులుగా వ్యవహరించటం తప్ప ఆయన ఏమి చేయలేదని అపవాదును ఆయన మూటకట్టుకున్నారు. 2008లో శ్రీకాకుళం జిల్లా హాస్పిటల్‌ను మెడికల్ కాలేజ్‌గా మార్చి 2013లో రిమ్స్‌గా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొని వచ్చారు. దీంతో అప్పట్లో పాలకొండ హాస్పిటల్‌ను జిల్లా హాస్పిటల్‌గా మారుస్తూ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ 2014 లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వంలో పాలకొండ గవర్నమెంట్ హాస్పిటల్‌ను ఏరియా హాస్పిటల్‌గా గుర్తించి, జిల్లా హాస్పిటల్‌ను టెక్కలికి తరలించారు. అప్పుడు పాలకొండ ఎమ్మెల్యేగా ఉన్న కళావతి కానీ, నియోజకవర్గ భాద్యులుగా ఉన్న జయకృష్ణ కానీ ఈ ప్రక్రియను కనీసం ఆపే ప్రయత్నం చేయలేదని ప్రజల్లో తీవ్ర అసహనం ఉంది. 2014లో మొదటిసారి ఓడిపోయాక కనీసం తమ ప్రభుత్వ హయాంలో అయినా ఈయన పాలకొండ కోసం ఏమైనా చేసినా ఈయన మీద ప్రజల్లో నమ్మకం వచ్చి 2019లో ఈయన గెలిచే అవకాశం ఉండదేమో కానీ ఆ దిశగా ఆయన ఎప్పుడూ కూడా ప్రయత్నాలు చేయకపోవడం వల్ల ప్రజల్లో ఈయన నమ్మకం కోల్పోయారు అని చెప్పుకోవచ్చు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పాలకొండ సమస్యలే ప్రతీ ఎన్నికల్లో కూడా హామీలుగా మారటం తీవ్ర జుగుప్సాకరమైన విషయంగా చెప్పవచ్చు. దశాబ్ద కాలంగా ఒక్క హామీ కూడా నెరవేరకపోవటం విడ్డురమనే చెప్పవచ్చు. ఒకవేళ ఏదైనా హామీ పొరపాటున నెరవేరిస్తే మళ్ళీ ఎన్నికల్లో ఇవ్వటానికి కొత్త హామీ వెతుక్కోవాలి, దాని బదులు ఇదే హామీ దశాబ్దాల పాటు ఇవ్వటం ఉత్తమం అని ఆయా పార్టీలు భావిస్తున్నాయేమో అనే ఛలోక్తులు కూడా ప్రజల్లో వినిపిస్తున్నాయి. గత రెండు ఎన్నికల్లో టిడిపి, వైసిపి తరపున ప్రత్యర్థులుగా ఉన్న జయకృష్ణ, కళావతినే ఈసారి ముచ్చటగా మూడోసారి ప్రధాన ప్రత్యర్థులుగా ఉండటం కొసమెరుపు. అయితే పొత్తుల్లో భాగంగా ఎన్‌డిఎ కూటమి తరపున జనసేనకు టిక్కెట్టు కేటాయించడంతో జయకృష్ణ టిడిపి నుంచి జనసేనలోకి వెళ్లి టిక్కెట్టు దక్కించుకున్నారు. దీంతో వైసిపి నుంచి కళావతి, జనసేన నుంచి జయకృష్ణ ముచ్చటగా మూడోసారి పోటీ పడుతున్నారు. ఒక్క హామీ కూడా నెరవేర్చని కళావతికి ప్రజలు పట్టం కడతారా? లేదా కొత్త పార్టీతో బరిలోకి దిగిన జయకృష్ణకు సానుబూతితో పట్టం కడతారా అని చర్చ జరుగుతోంది.

ఆ ఎన్నిక ప్రత్యేకం

విజయనగరం పార్లమెంట్ స్థానానికి 2006లో జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి కేవలం 157 ఓట్ల మెజార్టీతో టిడిపిపై గెలిచారు. ఇక్కడ టిడిపి నుంచి సిట్టింగ్ ఎంపిగా ఉన్న కొండపల్లి పైడితల్లినాయుడు ఆకస్మిక మరణంతో ఉప ఎన్నిక జరిగింది. టిడిపి అభ్యర్థిగా ఆయన కుమారుడు కొండపల్లి అప్పలనాయుడు, కాంగ్రెస్ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి బరిలో దిగారు. టిడిపిపై కేవలం 157 ఓట్ల మెజార్టీతో ఝాన్సీలక్ష్మి విజయం సాధించారు.. అప్పట్లో ఆమె ఎన్నికపై పెద్ద దుమారమే రేగింది.

- తెర్లాం ఎమ్మెల్యేగా ఉన్న తెంటు జయప్రకాష్ మృతి చెందడంతో 2008లో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో ఆయన కుమారుడు తెంటు లక్ష్మునాయుడు టిడిపి నుంచి పోటీ చేయగా, లోక్‌సత్తా నుంచి రెడ్డి లక్ష్మునాయుడుపోటీ చేశారు. ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి తెంటు లక్ష్మునాయుడు గెలుపొందారు.

రాజ్యసభ సభ్యులు వీరే..

విజయనగరం ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు ముగ్గురు మాత్రమే రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1984 నుంచి 90 వరకు యాళ్ల శశి భూషణరావు, 1994 నుంచి 2000 వరకు వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే ప్రస్తుతం చీపురుపల్లి నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీలో ఉన్న కిమిడి కళావెంకటరావు శ్రీకాకుళం జిల్లా నుంచి 1998-2004 వరకు రాజ్యసభ సభ్యులుగా చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గేదెల తిరుపతి ఆదివారం మండలంలోని బొడ్డవర, అమ్మపాలెం, రాజీపేట, గౌరీపురం, పెదకండేపల్లి, కాపు సోంపురం, చుక్కపాలెం, ఆలుగుబిల్లి, సీతమ్మ పేట, పోతనపల్లి, గౌరమ్మపేట, వినాయక పల్లి, చామలాపల్లి, సీతారాంపురం తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు, నానాజీ, భద్రరావు, శివ, చింతల ఈశ్వరరావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలోని కొట్టక్కి, జన్నివలస గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మరిపి విద్యాసాగర్ ప్రచారం చేశారు. పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు, నాలుగు మండలాల అధ్యక్షులు రాంబార్కి రామకృష్ణ, పొందూరు రవీంద్ర, రాజాన అప్పలనాయుడు, పత్రి రాజు, జె.శ్రీను, ఒక్కలగడ్డి భరత్, కిలారి జిన్నాబాయ్, రామారావు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

తుమికాపల్లి గ్రామంలో స్థానిక వినాయక్ నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు చెరుకూరి నాగరాజు దంపతులు, శ్రీవృక్ష జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఏడువాక గణేష్, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కళావి మతిలేని మాటలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడిపి అభ్యర్థి కళా వెంకటరావు జగన్‌పై మతి లేని మాటలు ఆడుతున్నారని రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఖండించారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ చీపురుపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కళా వెంకటరావు జగన్ మోహన్ రెడ్డి ఏనాడైనా తల్లికి తిండి పెట్టాడా అని వ్యాఖ్యానించడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో టిడిపి నాయకులు ఇలాంటి చవకబారు మాటలు ఆడడం వారికి అలవాటేనని విమర్శించారు. టిడిపి ఎన్ని జిమ్మిక్కులు ఎన్ని కుతంత్రాలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఈ రాష్ట్రానికి సిఎంగా జగన్ మోహన్ రెడ్డిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ కోరారు. ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమన్నారు.

విద్యుత్తు కనెక్షన్ తొలగింపు

ప్రజాశక్తి- బొబ్బిలి

కోమటిపల్లి ప్రజలకు తాగునీరు అందించే బోరుకు విద్యుత్తు కనెక్షన్‌ను గుర్తు తెలియని దుండగులు తొలగించారు. కోమటిపల్లి ప్రజలకు తాగునీరు అందించేందుకు రాజులు తోటలో బోర్లు వేసి తాగునీరు అందిస్తున్నారు. రాజకీయ కక్షతో దుండగులు శనివారం రాత్రి విద్యుత్తు వైర్లు కట్ చేసి, ఐరన్ పైపునకు కరెంటు సరఫరా అయ్యేలా చేశారని అదే గ్రామానికి చెందిన గొట్టాపు సత్యనారాయణ, పాపారావు ఆరోపించారు. విద్యుత్తు వైర్లు కట్ చేయడంతో తాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలి పారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకో వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తొలగించిన కనెక్షన్‌ను చూపిస్తున్న గ్రామస్తులు

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- డెంకాడ

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడం వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు అన్నారు. మండలంలోని గుండాలపేట, చింతలవలస, మోదవలస గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేలు చేసిన ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎమ్పీగా బెల్లాన చంద్రశేఖర్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవా సుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎమ్మెల్యే తనయుడు బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, నాయకులు పతివాడ కృష్ణవేణి, మోదవలస సర్పంచ్ కనకల రామారావు, నాగ వంశపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోని అప్పలనాయుడు, జొన్నాడ సొసైటీ చైర్మన్ పిన్నింటి సత్యారావు, నాయకులు బుగత రమణ, నామాల రమణ, బుగత రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

10 కుటుంబాలు వైసిపిలో చేరిక

డెంకాడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

చింతలవలస గ్రామంలో 10కుటుంబాలు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వైసిపిలో చేరాయి. గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రోగడ శివప్రసాద్, శ్రీనివాస్, ప్రసాద్, గిరిజాల రామకృష్ణ, తాడితూరు అప్పారావు, పెరిమల వెంకట్రావు, ఆంజరావు బ్రహ్మానందం ఉన్నారు.

వైసిపిలో చేరికలు

కొత్తవలస: లక్కవరపుకోట కొత్తవలస మండలాల నుంచి యువత వైసిపిలో చేరారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వారంతా వైసిపిలో చేరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఆదివారం ముమ్మర ప్రచారం చేశారు. జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, బొంతల వెంకట్రావు, గొరపల్లి రవి తదితరులు కొత్తవలసలోని 5, 6, 7 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేశారు.

వావిలపాడులో సర్పంచ్ ఆధ్వర్యాన..

వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామంలో సర్పంచ్ బీల రాజేశ్వరి దంపతులు ఆధ్వర్యంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావుకు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, ఉప

బొబ్బిలి: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

సర్పంచ్ జి వెంకటరావు, ఎన్.రాజు నాయుడు, బి.వెంకటరావు, జి.శ్రీరామ్మూర్తి, బి.చిన్నబాబు, పిఎస్.శ్రీను, ఈశ్వర్ రావు, అర్జునరావు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వానికి మద్దతు పలకండి: ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ మద్దతు పలకాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. ఆదివారం పట్టణంలోని 7, 9వ వార్డుల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ప్రస్తుత ప్రభుత్వంలో పేదరికాన్నే కొలమానంగా తీసుకుని అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలు పేదరిక నిర్మూలన, పెత్తందారీ వ్యవస్థల మధ్య జరుగుతున్నాయని తెలిపారు. ఎవరి పాలన మేలు చేస్తుందో ప్రజలు గుర్తించాలని, అందుకు అనుగుణంగా ఓట్లు వేసి వైసిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

భవిష్యత్తు కోసం కూటమిని గెలిపించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర భవిష్యత్ కోసం టిడిపి, జనసేన, బిజెపి కూటమిని గెలిపించాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన కోరారు. పట్టణంలోని పాకీవీధి, సాయినగర్ కాలనీలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికా రంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలనతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్ కె.లక్ష్మి, మాజీ కౌన్సిలర్ రౌతు రామమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బేబినాయనకు మద్దతుగా ప్రచారం

బేబినాయనకు మద్దతుగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ, ఐటిఐ కాలనీలో జనసేన, టిడిపి ఆధ్వర్య

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన

బొబ్బిలి: మాట్లాడుతున్న బేబినాయన

లో సైకిల్ ర్యాలీ చేశారు. జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి, మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్, టిడిపి నాయకులు పాల్గొన్నారు. బేబినా యనను గెలిపించాలని వికలాంగుల సంక్షేమ నాయకులు సిహెచ్ రాంబాబు, సభ్యులు పట్టణంలో ప్రచారం చేశారు.

ట్రైసైకిళ్లపై వీధుల్లో పర్యటించి బేబినాయనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బాడంగి: మండలంలోని కోడూరు పంచాయతీ గొల్లలపేట గ్రామంలో ఆదివారం బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమాన్ని టిడిపి బీసీ సాధికారిత జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు, సంక్షేమ కోసం, యువతకు ఉపాధి, ఉద్యోగాల కోసం బాబును మళ్లీ రప్పిద్దామని పిలుపునిచ్చారు. వైసిపి ఐదేళ్ల అరాచక పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మరిపె రమేష్, టిడిపి మండల ఉపాధ్యక్షుడు లచ్చుపతుల సత్యం, కోడూరు యువజన విభాగం అధ్యక్షుడు కొల్లి అప్పలనాయుడు (ఎల్‌ఐసి), కోడూరు బూత్ ఇన్‌చార్జి వెన్నెల గణేష్, కోడూరు గ్రామ టిడిపి అధ్యక్షుడు కొల్లి సత్యారావు, పార్టీ నాయకులు ఇప్పిలి రమేష్, పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న మాధవి

అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి- డెంకాడ

ఒకసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి కూటమి అభ్యర్థి లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని అక్కివరం, బంటుపల్లి, పినతాడివాడ, పెదతాడివాడ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తుందని, నిరుద్యోగ యువతకి ఉపాధి కల్పిస్తామని కంపెనీలు రావడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పల నారాయణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - గజపతినగరం

సిపిఎం ఆధ్వర్యంలో గజపతినగరంలో కారల్ మార్క్స్ 206 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా నాయ కులు జి శ్రీనివాస్, ఆర్ రాములు మాట్లాడుతూ కారల్ మార్క్స్ భౌతికంగా లేనప్పటికీ ఆయన ఆశయాలు సిద్ధాంతా లు ముందుకు తీసుకుపోయేవారిలో సజీవంగానే ఉన్నార న్నారు. పెట్టుబడిదారులు సాగిస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా కార్మికుల కష్టజీవులను ఐక్యం చేసే శాస్త్రీయమైన సిద్ధాంతాన్ని రూపకల్పన చేసిన మహానుభావుడు మార్క్స్ అని గుర్తు చేశారు. రష్యాలో కమ్యూనిస్టులు అధికారం కోల్పోయిన తర్వాత కమ్యూనిస్టు పార్టీలకి కమ్యూనిస్టులకి కాలం చెల్లిపో యిందన్న వారికి చైనా విప్లవం సరైన సమాధానం చెప్పింద న్నారు. నేడు ప్రపంచంలో చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాలు సోషలిస్ట్ మార్గంలో ముందుకు పోతున్నాయన్నారు. భారతదేశంలో బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరిస్తూ నిత్యవసర సరుకులు ధరలు నిరంతరం పెంచుతుందన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందన్నారు. రాజ్యాంగాన్ని లౌకికవాదాన్ని ప్రజాస్వా మ్యాన్ని కాలరాస్తూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందన్నారు. మరోవైపు మతం పేరుతో రిజర్వేషన్ల

మార్క్స్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పేరుతో కులాల మధ్యన మతాల మధ్యన ఘర్షణలను సృష్టి స్తుందన్నారు. పెట్టుబడి దారులకు ఊడిగంచేస్తూ మత రాజకీ యాలు చేస్తున్న ఫాసిస్ట్ పార్టీ బిజెపి నుండి లౌకిక వాదాన్ని, భారతదేశాన్ని రక్షించేది కేవలం కమ్యూనిస్టులే అన్నారు. ఈ బిజెపి విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ కమ్యూనిస్టులతో కలిసి రావాలని, నేడు జరుగుతున్న ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నింటినీ కలుపుకొని ఇండియా వేదిక బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ రాములు, హరికృష్ణ, వేణి రాము విద్యార్థులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలేక జీడిరైతు విలవిల

ప్రజాశక్తి – సీతంపేట

ఏజెన్సీలోని ఆదివాసీలకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా ఆదుకొనేది జీడి పంట అని చెప్పవచ్చు. సీతంపేట ఏజెన్సీలో గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యం వల్ల ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో పాటు జీడిపిండె దశలో వర్షాలకు తేనెమంచు, ఎండ తీవ్రత వల్ల జీడిపిండె రాలిపోయి, సగానికి సగం పంట దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. దీంతో పాటు గత రెండేళ్లుగా జీడిపిక్కలకు మార్కెట్ ధర లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 25వేల హెక్టార్లలో జీడి పంట ఉంది. ఈ పంట కొన్నిచోట్ల పంట 30శాతం కూడా దిగుబడి రాలేదు.

దళారులు కొనుగోలు చేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న జీడిపిక్కల బస్తాలు

కాపు లేక కుదేలు

డిసెంబర్‌లో జీడి పంట పూత దశలో వస్తుంది. ఫిబ్రవరిలో పిందె సమయంలో రెండు వర్షాలు, వడగండ్ల వాన పడడంతో పంట పువ్వు రాలింది. దీంతో పాటు తేనె మంచుతోనూ, మబ్బులతో పిందె నిలిచి పోయింది. దీంతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పిందె రాలిపోయింది. దీంతో పంట దిగుబడి తగ్గిపోయిందని గిరిజన రైతులను ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు మార్కెట్‌కు సంబంధించి నగదు రూ.50 వేలు మించి రవాణా చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో నగదు బదిలీ తక్కువ కావడంతో జీడిపిక్కల మార్కెట్ ధర పడిపోయింది. కిలో రూ.110, లేదా రూ.115 మాత్రమే వ్యాపారులు విక్రయిస్తున్నారు. గతేడాది కూడా వంద రూపాయలు మించకపోవ డంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగదు చెల్లింపుల్లేవన్న నెపంతో దళారులు సిండికేట్‌గా మారి జీడిపిక్కలను కారు చౌకగా కొనుగోలు చేసి లాభాలు అర్జిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీడికి మద్దతు ధర చెల్లించి విక్రయాలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

దిగుబడి రాలేదు

ఈఏడాది జీడి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఐదు ఎకరాలకు గత ఏడాది ఆరు క్వింటాలు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మూడు క్వింటాలు రావడం కష్టం. అలాగే అప్పట్లో జీడి చెట్లు వేసి 42 ఏళ్లయింది. చెట్లు ముదిరి పోవడంతో కాపు తగ్గింది. దీంతో పాటు ప్రకృతి వైపరీత్యం వల్ల పంట తగ్గింది. మార్కెట్ ధర కూడా లేదు.

నిమ్మక నారాయణరావు,
కంబగూడ గిరిజనుడు.

కిలో రూ.200 చొప్పున కొనుగోలు చేయాలి

గిరిజనులు శ్రమించు జీడి పిక్కలు సేకరించినా దళారులు సిండికేట్‌గా మారి మార్కెట్ ధర కల్పించక పోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. అధికారులు స్పందించి రూ.200 చొప్పున కిలో జీడి పిక్కలుకొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఆరిక భాస్కర్ రావు,
సిపిఎం మండల కార్యదర్శి, సీతంపేట.

విస్తృతంగా రాజన్నదొర ప్రచారం

ప్రజాశక్తి – సాలూరు

టిడిపి మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు గాలిలో దీపాల్లాంటివని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 8,9,10,3 వార్డుల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆచరణ సాధ్యమైన హామీలనే వైసిపి మేనిఫెస్టోలో పొందుపర్చినట్లు చెప్పారు. 99 శాతం హామీలను అమలు చేసినట్లు చెప్పారు. గతంలో టిడిపి హయాంలో ముడుపులు చెల్లిస్తే గానీ సంక్షేమ పథకాలందే పరిస్థితి లేదన్నారు. జన్మభూమి కమిటీలు జలగల్లా జనాలను పీల్చుకుతిన్నాయన్నారు. ఇచ్చిన మాట అమలు చేసే బాధ్యత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యేగా తనకు, ఎంపి అభ్యర్థిగా డాక్టర్ తనూజా రాణికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని రాజన్నదొర కోరారు. ప్రచారంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లి జగన్మోహన్ రావు, వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్ తాడ్డి శంకరరావు పాల్గొన్నారు.

80 కుటుంబాలు వైసిపి లో చేరిక

ఎన్నికల ప్రచారంలో భాగంగా నాలుగో వార్డులో రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్సై చింతగడ దాసు, కౌన్సిలర్ గొల్లపల్లి వరప్రసాద్ నాయకత్వంలో 80 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపి లో చేరాయి.డిప్యూటీ సిఎం రాజన్నదొర వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వార్డుల్లో ప్రచారం చేస్తున్న రాజన్నదొర

కార్పొరేట్ బోధనలతో మెరుస్తున్న 'వేదాంత'

ప్రజాశక్తి– పార్వతీపురం

స్థానిక వేదాంత జూనియర్ కళాశాల వరుసగా మూడేళ్లలో ఐఐటి–నీట్ ర్యాంకులను సాధిస్తూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులు వ్యయ ప్రయాసలకు లోను కాకుండా వారి కుటుంబాల్లో వెలుగు నింపడానికి కార్పొరేట్ విద్యను అందివ్వాలన్న సదుద్దేశంతో స్థానిక చర్చి వీధిలో 2020లో వేదాంత జూనియర్ కళాశాలను స్థాపించారు. అప్పటి నుంచి వేదాంత జూనియర్ కళాశాల వరుసగా మూడుసార్లు 2022, 23, 24 విద్యా సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ ఇంటర్‌లో ఘనమైన హ్యాట్రిక్ విజయాలను సాధించడంలో పార్వతీపురం ప్రాంతానికి తమదైన ముద్ర వేసుకున్నారు. 2022 ఇంటర్ ప్రారంభ బ్యాచ్‌లో గిరి పుత్రిక పి.చాందిని ఎంపిసిలో 883 మార్కులు సాధించి మన్యం జిల్లా టాపర్‌గా నిలిచింది. ఎం సృజన బిఐర్‌పిలో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించి ప్రతిష్టాత్మక ఎయు ఇంజనీరింగ్ కాలేజీలో సీటు సంపాదించారు. అదే ఏడాది కెవివి ప్రతాప్ రాజ్, ఎపి నిట్‌లో ఇసిఇలో చేరగా, ఆర్.కల్యాణ్ పాండిచేరి ఎస్ఐటిలో కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లో చేరారు. నీట్‌లో ర్యాంకు సాధించిన బి.శ్రీహర శ్రీకాకుళం ఎస్ఎస్ డెంటల్ కాలేజ్, పి.చాందిని విట్ ఆంధ్ర సిఎస్ఇ లోను, వై.శ్రీదేవి కాకినాడ జెఎన్‌టియు కాకినాడలో బి–ఫార్మసీ కోర్సుల ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వీరితో పాటు సుమారుగా 83మంది వేదాంత ఎంపిసి విద్యార్థులు ఆంధ్రాలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ కాలేజీలో చేరగా, 11మంది బైపిసి విద్యార్థులు ఫార్మసీ కోర్సులో చేరారు. 2023 రెండో బ్యాచ్ జి.విజయ్ గౌరి ఎంపిసిలో 985 మార్కులతో జిల్లా ఫస్ట్ సాధించగా, బైపిసిలో వి.నవ్యశ్రీ 980 మార్కు లు సాధించి జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. అదే ఏడాది కె.సుహార్షిని ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గానూ 464 మార్కులతో రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. బైపిసిలో జి.నీలిమ మార్కులకు గానూ 426, డి.గౌతమి 426 మార్కులను సాధించి టౌన్ ప్రథమ స్థానంలో నిలిచారు. సెకండ్ బ్యాచ్‌లో హరిప్రియ దర్శిని ఎంపిసిలో 899 మార్కులు సాధించిన ప్పటికీ ఐఐటి జెఇఇ అడ్వాన్సుడులో అద్భుత ప్రతిభ కనబర్చి భువనేశ్వర్ ఐఐటిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో సీటు సాధించారు. ఈ విద్యార్థిని గరుగు బిల్లి మండలం దళాయివలసకు చెందిన సాధారణ ఎలక్ట్రిషన్ పూడి సింహాచలం కుమార్తె ఇంతటి ఘనతను సాధించింది. అదే బ్యాచిలో టి.సందీప్ పంజాబ్ రాష్ట్రం రోపర్ ట్రిపుల్ ఐఐటిలో సీటు సాధించి వేదాంతాన్ని మరింత ఉన్నత శిఖరానికి చేర్చాడు. మూడో బ్యాచ్‌లో ఎంపిసిలో కె.సుహర్షిని 981 మార్కులు సాధించగా, బైపిసిలో జి.నీలిమ 977 మార్కులను సాధించి టౌన్ టాపర్‌గా నిలిచింది. 2024 ఐఐటి మెయిన్స్‌లో సుజిత్ కుమార్ (రెండవ బ్యాచ్ విద్యార్థి) ఆలిండియా స్థాయిలో 1893 ర్యాంక్ సాధించగా కె.దర్శిని 91.10 పర్సంటైల్ లో సాధించింది. వీరితో పాటు మరో ఆరుగురు విద్యా ర్థులు ఐఐటి, జెఇఇలో అడ్వాన్స్డ్ రాయడానికి అర్హత పొం దారు. ఐఐటి, నీట్‌లో ర్యాంకులు సాధించడమే కాకుండా భవితను మార్చే ఇంటర్ విద్యలోనూ, ఉత్తీర్ణత శాతం లోనూ వేదాంత అగ్రగామిగా నిలిచింది. సీనియర్ ఇంటర్ బైపిసిలో 83శాతం, ఎంపిసిలో 68శాతం ఉత్తీర్ణత పొందారు. విద్యార్థిని విద్యార్థులు ప్రత్యేక హాస్టల్ సదుపాయం ఉంది.



విద్యార్థులను అభినందిస్తున్న జెసి గోవిందరావు (ఫైల్)

కార్పొరేట్ బోధనలో 20 ఏళ్ల అనుభవం

ఐఐటి ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులు బోధనల్లో డాక్టర్ పెంట అప్పారావు, ఎస్ఎల్ నాయుడు కార్పొరేట్ సంస్థల్లో 20 ఏళ్ల బోధన అనుభవం ద్వారా వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు ఘనమైన ఫలితాలను సాధించగలుగుతున్నామన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న వేదాంత విద్యార్థులు

వేదాంత జూనియర్ కళాశాల యాజమాన్యం మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ప్రోత్సహించడంతో తమ కళాశాల నుంచి జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో కోట సౌమ్య పాల్గొని మంచి ప్రతిభ కనబరిచింది. 2023 ఆడుదామా ఆంధ్రాలో జ్యోత్స్న సెపిల్ బ్యాట్మెంటన్‌లో జిల్లాస్థాయి సీల్డ్‌ను సాధించింది. పెన్సిల్ డ్రాయింగ్‌లో సరయు, వ్యాసరచన పోటీల్లో టి.పవిత్ర జిల్లా, రాష్ట్రస్థాయి ప్రథమ స్థానాలు కైవసం చేసుకొని జాతీయ స్థాయికి ఎంపికైంది. నియితి, గుణచందనలు రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు.

ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర అరసం శాఖ సంపాదకత్వంలో ఎన్నికల భారతం వచన కవితా సంకలనం పుస్తకావిష్కరణ ఆదివారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో జరిగింది. ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరునాయుడు ఆవిష్కరించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను చైతన్యపర్చేలా ఈ పుస్తకం రావడం ఎంతో ఆహ్వానించదగ్గదని గౌరునాయుడు అన్నారు. ఈ సంకలనంలో చోటు సంపాదించుకున్న ప్రతి కవినీ ఆయన అభినందించారు. అరసం రాష్ట్ర శాఖ అధ్యక్షులు వల్లూరు శివప్రసాదరావు ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించారు. ఇంకా ఈ సభలో అధ్యక్షులు చింతా అప్పలనాయుడు, మల్లిపురం జగదీశ్, జాగాన సింహాచలం, తిరుమలాచార్యులు తదితరులు ప్రసంగించారు.

రక్త నమూనాలను సేకరిస్తున్న ఫైలేరియా యూనిట్ అధికారులు

లక్ష్మీపురంలో ఫైలేరియా సర్వే

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో ఫైలేరియా సర్వేను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైలేరియా విజయనగరం యూనిట్ సూపర్వైజర్ కె.రాఘవేంద్ర కుమార్ మాట్లాడుతూ ముందుగా గ్రామాల్లో రక్త నమూనాలు సేకరించి అందులో ఏదైనా పాజిటివ్ కేసులు వస్తే వాటిని గుర్తించి అట్టివారికి మందులు ఇవ్వబడతాయని అన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో రాత్రి వేళల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పెదంకలాం హెచ్ఎస్ గోపాలరావు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎఎస్ఎం బి.రమాదేవి, ఎంఎల్ ఇట్స్ ఇఒలు కె.కీర్తి, వై.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో గీతారాణి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి – కురుపాం

కురుపాం నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ట్రాన్స్ జెండర్ అడ్డాకుల గీతారాణి ఆదివారం తన ఎన్నికల ప్రచారాన్ని జియమ్మవలస మండలంలో గల పల్లపు సిరిపి, నడిమి సిరిపి, టికె జమ్ము, కొండా చిలాకం, చిలకాం వలస, చినదొడ్డి తదితర గిరిజన గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు నియోజకవర్గంలో గల ట్రాన్స్ జెండర్లు, స్థానిక గ్రామాల యువత గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణశిబిరం

ప్రజాశక్తి – గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ మేరకు ఆదివారం విద్యార్థులు అధిక సంఖ్యలో శిక్షణా శిబిరంలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులకు ఈ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలు ప్రతిరోజూ ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయంలో చదువుతున్న చిన్నారులు

మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి బొబ్బిలి శ్రీను

బూటకపు హామీలు నమ్మకండి

కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి బొబ్బిలి శ్రీను

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి, టిడిపి బూటకపు హామీలను ప్రజలు నమ్మవద్దని ఇండియా వేదిక మద్దతుతో పోటీలో ఉన్న కాంగ్రెస్ విజయనగరం ఎంపి అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. ఆదివారం మొసానిక్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన వెలమ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గంలో కొప్పలవెలమల ప్రాబల్యం ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు కొప్పల వెలమలను గుర్తించక పోయినప్పటికీ జాతీయస్థాయిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ గుర్తించి టిక్కెట్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈనేపథ్యంలో కొప్పల వెలమలంతా తనకు మద్దతు తెలపాలని కోరారు. తననున గెలిపిస్తే జిల్లా ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కాంగ్రెస్ హయాంలోనే వచ్చిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలందరికీ కనీస వేతనం రూ.400 సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి సత్యనారాయణ కోశాధికారి గోపాల్, రామారావు, స్వామి నాయుడు పాల్గొన్నారు.

విజయనగరంలో శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

శేషగిరి స్ఫూర్తితో విద్యారంగాన్ని కాపాడుకుంటాం

ప్రజాశక్తి- విజయనగరంటౌన్/శృంగవరపుకోట

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ పరిరక్షణకు కృషి చేసిన కె.శేషగిరి ఆశయాలను కొనసాగిస్తామని యుటిఫ్ నాయకులు ఉద్ఘాటించారు. ఆయన స్ఫూర్తితో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యమిస్తామని తెలిపారు. శేషగిరి 3వ వర్ధంతి సభ ఆదివారం విజయనగరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ముందుగా ఆయన చిత్రపటం వద్ద యుటిఎఫ్ నాయకులంతా నివాళులర్పించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్‌జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు డి.రాము మాట్లాడారు. జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలపై శేషగిరి అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకో గలిగామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.శ్రీనివాసరావు, జి.నిర్మల, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట చింతబడి ప్రాంగణంలో శేషగిరి వర్ధంతిని యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ శేషగిరి ఆధ్వర్యాన అనేక ఉపాధ్యాయ ఉద్యమాలు చేపట్టామని గుర్తు చేశారు. హైస్కూల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గేదెల బంగారు నాయుడు శేషగిరితో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆశపు శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎం కొండలరావు, జె శ్రీరామ్ మూర్తి, టి సింహాచలం నాయుడు, పిల్లా గణపతి, సిహెచ్ సర్వదేములు పాల్గొన్నారు.

ఎస్.కోటలో శేషగిరి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

ఉత్సాహంగా పోస్టల్ బ్యాలెట్

జిల్లాలో మొత్తం ఓట్లు 6822.. పోలైన ఓట్లు 3310

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఆదివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాల్లో అధిక సంఖ్యలో ఉదయం నుంచి హాజరై ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నడూ లేని విధంగా పోలింగ్ కేంద్రాల బయట రాజకీయ పార్టీలు శిబిరాలను ఏర్పాటు చేసుకొని ఓటింగ్‌లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు తమ పార్టీలకు అనుగుణంగా ఓటు వేయాలని అభ్యర్థించడం కనిపించింది.

పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో మొత్తం 6812 మంది ఓటర్లకు గాను 3310 మందిఓటర్లు తొలిరోజు ఆదివారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా యేతర ఓటర్లు 1587కు గానూ 332 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నియోజకవర్గ ఓటర్లకు వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి దాదాపు 1751 ఓట్లు నమోదు కాగా, 1098 ఓట్లు పోలయ్యాయి. పార్వతీపురం ఎస్‌విడి కళాశాల ఆవరణలో జిల్లాయేతర ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో మందకోడిగా పోలింగ్ జరింది. 1587గానూ 332 ఓట్లు పోలయ్యాయి. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేంకటేశ్వర డిగ్రీ కళాశాల, కురుపాం మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, పాలకొండ

సాలూరులో ఓటేసేందుకు టెంట్‌లో నిరీక్షిస్తున్న ఉద్యోగులు

పార్వతీపురంలో ఓటేసేందుకు క్యూలో నిల్చొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను పరిశీలించారు. జెసి, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ ఎస్ శోబిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు, కంట్రోల్ రూం ఇన్‌ఛార్జి, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పర్యవేక్షణ చేశారు.

సాలూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు వేశారు. ఆర్వో విష్ణు చరణ్ దగ్గరుండి పోలింగ్ పర్యవేక్షించారు. నియోజకవర్గంలో 1291 పోస్టల్ బ్యాలెట్‌లకు గానూ తొలిరోజు 546 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమ, మంగళవారాల్లో కూడా పోలింగ్ జరగనుంది.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో నాలుగు మండలాలకు సంబంధించి పోస్టల్‌బ్యాలెట్ జరిగింది. నియోజకవర్గంలో 1539 ఓట్లు గానూ 756 ఓట్లు పోలయ్యాయి. ఓటేసేందుకు సుమారు అరగంట సమయంపట్టడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. మరో రెండురోజుల పాటు ఓటు హక్కును వినియోగించుకోవచ్చునన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆర్ఒ శుభం బన్సల్‌కు సూచించారు.

కురుపాం : స్థానిక మోడల్ స్కూల్‌లో నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 910 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి. రమణ తెలిపారు. 2,241 మంది పోస్టల్ బ్యాలెట్ కలిగిన ఉద్యోగులుండగా తొలిరోజు 910 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మోడీ వస్తే అటవీ సంపదంతా అదానీకే

సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు లోకనాధం

ప్రజాశక్తి - పాచిపెంట

బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే మైనింగ్ పేరుతో గిరిజన ప్రాంతాల్లోని అటవీ సంపదంతా అదానీకి అప్పగించేస్తుందని, కావున ప్రజలంతా రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పి సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం పిలుపునిచ్చారు. ఇండియా వేదిక బలపర్చిన అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనరస గెలుపును కోరుతూ పాచిపెంటలో ర్యాలీ, అనంతరం రచ్చబండ కూడలి వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు అధ్యర్యంలో సభ జరిగింది. అనంతరం మక్కువలో కూడా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ బిజెపి విధానాల వల్ల దేశం ప్రమాదంలో పడిందని, నిరుద్యోగం పెరిగిందని, వ్యవసాయ రంగం నాశనమైందని, పోరాడి సాధించుకున్న అప్పలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఇప్పుడు మూడోసారి అధికారంలోకి రావాలని కుట్ర, కుతంత్రాలు చేస్తోందని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ఇంత ద్రోహం చేసిన బిజెపిని కేంద్రంలో రానీయకుండా చూసే బాధ్యత ప్రజలందరిదని అన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో అటవీ హక్కు, ఉపాధి హామీ, విద్యాహక్కు చట్టాలను సాధించుకున్నామని, ఈ చట్టాలన్నింటినీ ఉల్లంఘిస్తున్న బిజెపికి వంతపడుతున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని, ప్రజల కోసం నికరంగా నిలబడే ఎర్రజెండా సిపిఎం అభ్యర్థులను, ఇండియా వేదిక బలపరిచిన

గరుగుబిల్లి : కె.రామినాయుడువలసలో హారతిచ్చి రమణకు స్వాగతం పలుకుతున్న మహిళ

పాచిపెంటలో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు లోకనాధం

అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వి.ఇందిర, ఎన్‌వై నాయుడు, మర్రి శ్రీనివాసరావు, మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, సూకూరు అప్పలస్వామి, వర్ష్ణ, కొర్ర కళ్యాణ్, అర్జున్, శ్రీనివాస్, లివ్యు, సాంబయ్య, ఎర్రయ్య, జన్ని రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని కల్లికోట, దుగ్గి, మార్కొండ పుట్టి, చంద్రంపేట, పరశురాంపురం, గుణానపురం, అర్తాం, విక్రాంపురం, శివిని గ్రామాల్లో సిపిఎం నాయకులు వి.ఇందిర, కొల్లి సాంబమూర్తి, హెచ్.రామారావు ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్ర జెండా తరుపున సిపిఎం అభ్యర్థులుగా కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి మండంగి రమణ, అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరారు

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో కురుపాం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి మండంగి రమణ ప్రచారం చేశారు. కె.రామినాయుడువలస గ్రామస్తులు ఎమ్మెల్యే అభ్యర్థికి హారతులతో స్వాగతం పలికారు. గొట్టివలస గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రమణ మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులుగా సిపిఎం అభ్యర్థిగా కురుపాం నియోజకవర్గానికి పోటీ చేస్తున్న తనకు, అరకు పార్లమెంటరీ స్థానానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిపిఎం నాయకులు రెడ్డి శంకరరావు, బివి రమణ, కె.రవీంద్ర, దాసరి వెంకట నాయుడు, కాంగ్రెస్ నాయకులు బోను శంకరరావు, మరడ వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.